సాక్షి
పార్వతీపురం మన్యం

గురువారం । 4 । సెప్టెంబర్ । 2025



మహిళా సంక్షేమంపై మరుపు

మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం మర్చిపోయింది.

- 8లో

ర్యాగింగ్‌కు పాల్పడి జీవితం నాశనం చేసుకోవద్దు



విజయనగరం జిల్లాలో వివిధ ఇంజినీరింగ్, మెడికల్, పాలిటెక్నిక్, ఇతర కళాశాలలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ర్యాగింగ్ జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందల్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు.

- 8లో



ఆటో, మ్యాక్సీ క్యాబ్ కార్మికులను ఆదుకోవాలి

- 8లో

ఆటో మ్యాక్సీ క్యాబ్ రంగ కార్మికులు ఈనెల 17న చేపట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు.

న్యూస్‌రీల్

ఆవిష్కరణాత్మక ప్రాజెక్టు ప్రతిపాదనలు పంపాలి

పార్వతీపురం: నూతన ఆవిష్కరణాత్మక ప్రాజెక్టులకు ప్రతిపాదనలను ఈ నెల 5వ తేదీలోగా నీతి ఆయోగ్‌కు సమర్పించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో ఆయన బుధవారం సమీక్షించారు. యాస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం(ఏడీపీ), యాస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం (ఏబీపీ) కింద నూతన ఆవిష్కరణ ప్రాజెక్టు ప్రతిపాదనలు సిద్ధంచేసి పంపించాలన్నారు. జిల్లాస్థాయి ప్రతిపాదనల సమన్వయం, పర్యవేక్షణకు నోడల్ అధికారిగా మహేష్ వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పిటిమండలో వైద్యశిబిరం



పిటి మండలో గిరిజనులకు వైద్యం చేస్తున్న డాక్టర్ శంకరరావు

సాక్షి ఎఫెక్ట్...

జియ్యమ్మవలస(రూరల్): గిరిజన గ్రామాల్లో జ్వరాల ఉధృతిపై 'మంచం పట్టిన మన్యం' శీర్షికన 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన వార్తకు వైద్యాధికారులు స్పందించారు. రావాడ రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ శంకరరావు సిబ్బందితో కలిసి పిటిమండ గిరిజన గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత గిరిజనులకు అవగాహన కల్పించారు. కాచిచల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

గిరిజన ఇళ్లకు నిప్పు




కాలిపోతున్న పూరి గుడెసలు

వీరఘట్టం: మండలంలోని పెద్ద గదబవలస పంచాయతీ పరిధిలో గదబవలస కాలనీకి కొద్ది దూరంలో గిరిజనులు వేసుకున్న ఐదు పూరిళ్లకు గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం సాయంత్రం నిప్పుపెట్టారు. పూరిళ్లన్నీ కాలి బూడిదయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ జి.కళాధర్ తెలిపారు. గదబవలస కాలనీకి సందిమానుగూడకు మధ్యలోని ప్రభుత్వ స్థలాన్ని సందిమానుగూడకు చెందిన గిరిజనులకు ఐటీడీఏ గతంలో డీ పట్టాలు ఇచ్చింది. అదే స్థలంలో గదబవలస కాలనీకి చెందిన కొంత మంది అక్రమంగా గుడెసెలు వేశారు. దీనిపై పట్టాదారులు ఫిర్యాదు చేయడంతో ఈ ఏడాది జనవరిలో తొలగించారు. మళ్లీ గదబవలస కాలనీకి చెందిన కొంత మంది ఈ ఏడాది మార్చి నెలలో ఇక్కడ మరలా గుడెసెలు వేశారు. ప్రస్తుతం వాటికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టినట్టు ఎస్‌ఐ తెలిపారు.

బడిదేవరకొండ గ్రానైట్ లైసెన్స్ రద్దుకు డిమాండ్

- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఏపీ రైతు సంఘం నాయకులు



కలెక్టర్ కార్యాలయం వద్ద వినతిపత్రాన్ని చూపిస్తున్న రైతు సంఘం నాయకులు

పార్వతీపురం రూరల్: బడిదేవరకొండ గ్రానైట్ లైసెన్స్‌ను రద్దుచేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ వెలగవలస చెరువును గ్రానైట్ బూడిదతో నింపేసి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు పాడి బంగారిదొర మృతికి గ్రానైట్ కంపెనీయే కారణమని ఆరోపించారు. బంగారిదొర కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇప్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కంపెనీపై క్రిమినల్ కేసు నమోదు చేసి యజమానిని అరెస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: జాతీయ స్థాయిలో జరిగే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమైందని డీఈఓ యు.మాణిక్యంనాయుడు తెలిపారు. దరఖాస్తులు ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ 'బీఎస్‌ఈ.ఏపీ.జీఓవి.ఐఎన్'లో అందుబాటులో ఉన్నాయన్నారు.

చినుకు పడితే..

పడవే ఆధారం

కొమరాడ మండలంలోని నాగావళి నదికి ఆవల తొమ్మిది పంచాయతీల పరిధిలో 33 గ్రామాల ప్రజలు నివాసం ఉంటున్నారు. వీరంతా రోజువారీ పనులకు నాగావళి నదిని దాటుకుని రావాల్సిందే. పడవ ప్రయాణమే వీరికి ఆధారం. నది ఉధృతంగా ప్రవహించే సమయంలో బాహ్య ప్రపంచంతో వీరికి సంబంధాలు పూర్తిగా తెగిపోతాయి. పూర్ణపాడు–లాభేసు వంతెన పూర్తయితే ఈ ప్రాంతాల్లోని సుమారు 20 వేల మందికిపైగా ప్రయోజనం.



నాగావళి నదిపై కొమరాడ-కొట్టు గ్రామాల మధ్య పడవ ప్రయాణం

తుఫాన్ వర్షాలతో పాచిపెంట మండలం వేటగానివలన పెద్దగెడ్డ ఉగ్రరూపం దాల్చింది. ఇటుగా ఆరు పంచాయతీలు, 72 గ్రామాలకు చెందిన సుమారు 13,200 మంది నివాసం ఉంటున్నారు. ఈ మార్గం ద్వారానే నిత్యం ప్రజలతో పాటు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటుగానే అరకు కూడా చేరుకుంటారు. వర్షాకాలంలో గెడ్డ ప్రవాహం పెరిగి రాకపోకలకు కష్టతరంగా మారుతుంది. అత్యవసర సమయంలో 108 వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి. దీనికి ఈ చిత్రమే సాక్ష్యం.



ప్రయాణానికి చింతే..

- మన్యం ప్రజలను వీడని వరద కష్టాలు
- నదులు, గెడ్డలు పొంగితే రాకపోకలు బంద్
- విద్యార్థులకు, గ్రామస్తులకు తప్పని ఇబ్బందులు

సాక్షి, పార్వతీపురం మన్యం:

వర్షం కురిస్తే చాలు.. మన్యం ప్రజలు వణుకుతారు. నదులు, వాగులు దాటి స్కూల్‌కు వెళ్లిన చిన్నారులు.. కూలి పనులకు వెళ్లిన పెద్దలు తిరిగి ఇంటికి చేరేవరకు బిక్కుబిక్కుమంటూ గడుపుతారు. ఇక్కడ చినుకు రాలినా.. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిసినా వారికి భయమే. సరైన రహదారులు లేక.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నదులు, వాగులు, వంకలు దాటుకుంటూ ప్రయాణాలు చేయడం జిల్లాలో నిత్యకృత్యంగా మారింది. చాలా వరకు నదులపై వంతెనలు లేకపోవడం, చిన్నపాటి వరదలకే కల్వర్టులు, కాజ్‌వేలు కొట్టుకుపోవడంతో ప్రధానంగా గిరిజనులు, విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. గర్భిణులు, రోగులను డోలీలు కట్టి, వాగుల మీదుగా తీసుకెళ్లిన ఘటనలు అనేకం. జిల్లా వ్యాప్తంగా 11 మండలాల్లో 50 వరకు వంతెనలు, కాజ్‌వేలు, కల్వర్టులు అవసరమని గిరిజన సంక్షేమశాఖ అధికారుల అంచనా. నిధులు లేక మధ్యలోనే ఆగిపోతున్నవి కొన్ని వారధులు కాగా.. నిధులు కోసం చూస్తున్నవి మరికొన్ని ఉన్నాయి.



పార్వతీపురం మండలం వెలగవలస పంచాయతీలో గెడ్డ దాటి పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

- ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో 96 కిలోమీటర్ల మేర నాగావళి ప్రవహిస్తోంది. ఎగువన వర్షాలకు నది ఉధృతంగా ప్రవహిస్తే ఆవలున్న గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాకపోకలు సాగించే క్రమంలో పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డారు. గతేడాది పాచిపెంట మండలం కొటికిపెంట ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయులు ఇద్దరు గెడ్డ దాటుతుండగా ప్రవాహంలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. పశువులు కూడా నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన సందర్భాలున్నాయి.
- కురుపాం మండలం గొట్టివాడ గ్రామస్తులు మార్గమధ్యంలోని బోరిగెడ్డ దాటి ఏ పనికైనా ఇటు రావాల్సిందే.
- సీతంపేట మండలం రేగులగూడ–వెంపలగూడ మధ్య ప్రయాణం వర్షాకాలంలో ప్రమాదకరంగా మారుతోంది. వానలు కురిస్తే వాగు పొంగి, సమీప ప్రాంతాలకు రాకపోకలు తెగిపోతున్నాయి.
- భామిని మండలం కొరమ సమీపంలోని బగ్గాము త్రిపాడు గెడ్డపై ఆంగ్లేయుల కాలంలో నిర్మించిన వంతెన 2002లో కూడిపోయింది. తర్వాత ప్రత్యామ్నాయంగా రూ.16 లక్షల వ్యయంతో కాజ్‌వే నిర్మాణం చేపట్టారు. భారీ వర్షాలు కురిస్తే వాగు ఉధృతంగా ప్రవహించి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.
- మెంటాడ మండలం జగన్నాథపురం వద్ద చంపావతి నదిపై నిర్మించిన కల్వర్టు వర్షాల సమయంలో కొట్టుకుపోవడం సాధారణంగా మారింది. ప్రస్తుతం కూడా వర్షాలకు నది ప్రవాహం ధాటికి దెబ్బతింది. దీంతో జగన్నాథపురం, చాకివలస గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.
- పార్వతీపురం మండలం వెలగవలస పంచాయతీ సందివలస గ్రామం నుంచి విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే గెడ్డ దాటాల్సిందే. ఇటీవల కురిసిన వర్షాలకు గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో విద్యార్థులు భయంభయంగానే వెళ్తున్నారు.
- ఒడిశాలో వర్షాలు కురిస్తే సాలూరు నియోజకవర్గంలో సువర్ణముఖి నది ఉధృతి పెరిగి సమీప గ్రామాల ప్రజలకు రాకపోకలు బంద్ అవుతున్నాయి. దండిగాం వద్ద గతంలో వాహనాలు కూడా కొట్టుకుపోయాయి. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఇక్కడి కాజ్‌వే స్థానంలో డబుల్ రోడ్డుతో కూడిన వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఎండీఆర్ ప్లాన్ కింద రూ.8 కోట్లు మంజూరు చేయించారు. పనులు ప్రారంభమయ్యే సమయానికి ప్రభుత్వం మారడంతో ముందుకు సాగలేదు. అనంతర కాలంలో వంతెన పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. దీనివల్ల దండిగాం, కురుకూటి, సొంపిగాం, డెన్సరాయి తదితర పంచాయతీల్లోని సుమారు 20కిపైగా గిరిజన గ్రామాల ప్రజలు వర్షాకాలం సమయంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని సువర్ణముఖి నది దాటుతున్నారు. సాలూరు మండలంలోని పెద్దపారన్నవలస గ్రామంలోని కూరగెడ్డపై కూడా నీటి ప్రవాహం అధికంగా ఉన్న సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.




సాలూరు మండలం పెద పారన్నవలస గ్రామంలో కూరగెడ్డపై స్థానికులు ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెనపై వెళ్తున్న విద్యార్థులు

సంయుక్త కలెక్టరుగా యశ్వంత్ కుమార్ రెడ్డి

- జేసీ శోభికకు బదిలీ



సాక్షి, పార్వతీపురం మన్యం: జిల్లా సంయుక్త కలెక్టర్ గా సి.యశ్వంత్ కుమార్ రెడ్డి నియమితులయ్యారు. ఇప్పటివరకు పనిచేస్తున్న ఎస్.ఎస్.శోభికకు బదిలీ అయింది. నూతనంగా నియమితులైన 2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన యశ్వంత్ కుమార్ రెడ్డి.. కొద్దిరోజుల కిందటి వరకు జిల్లాలోనే పాలకొండ సబ్‌కలెక్టర్‌గానూ, సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓగా పని చేశారు. కొద్దిరోజుల కిందటే ఆయనకు బదిలీ కాగా.. ప్రస్తుతం జిల్లా లోని సంయుక్త కలెక్టర్ గా పోస్టింగ్ ఇవ్వడం గమనార్హం. కొద్ది రోజుల కిందటి వరకూ ఇక్కడే పని చేసిన అశుతోష్ శ్రీవత్సవ గుంటూరు సంయుక్త కలెక్టర్‌గా నియమితులయ్యారు.



బహుముఖ ప్రజ్ఞాశాలి శంకరరావు



శంకరరావు

పాలకొండ రూరల్: పాలకొండ ఉన్నత పాఠశాలలో సంస్కృత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న భౌరోతు శంకరరావు వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైనా బహుముఖ ప్రజ్ఞాశీలి. వృత్తితో పాటు పౌరాణిక, రంగస్థల నటుడిగా, సామాజిక కార్యకర్తగా ఈ ప్రాంత ప్రజలకు చిరపరిచితుడు. ఆయన రచనలు సాహితీవేత్తల ప్రశంసలు అందుకున్నాయి. ఆయన తరగతి గదిలో బోధన విలక్షణం. రచనలు, కళలపై విద్యార్థులను ప్రోత్సహిస్తారు. ఆయన రాసిన జిల్లెల ముడమ్మ జీవిత చరిత్ర, శంకర శతకం గుర్తింపును తెచ్చాయి. ఉత్తరాంధ్రాలో రాజకీయ ప్రముఖులకు, విశ్రాంత ఉద్యోగులకు 600లకుపైగా సన్మాన పత్రాలు రాశారు. జిల్లేడు అమ్మ సేవా సంస్థ ఏర్పాటుచేసి పేదలకు, విద్యార్థులకు తన వంతు సేవలు కొనసాగిస్తున్నారు. తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకు ఆయన చేస్తున్న కృషికి అవార్డు వరించింది.

ఉత్తమ బోధనకు అవార్డు



శంకరరావు

జియ్యమ్మవలస: పెదబుడ్డిడి(బీసీ) ఎంపీపీ పాఠశాలలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు ఎర్ర శంకరరావు 2002 డీఎస్సీలో రంగారెడ్డి జిల్లాలో ఎస్జీటీ ఉపాధ్యాయునిగా ఎంపికై 610 జీవోలో జియ్యమ్మవలస మండలం పరజపాడు గ్రామానికి బదిలీపై వచ్చారు. ఆయన పనిచేసిన పాఠశాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతారు. ఉత్తమ బోధనకు అనువుగా మార్చుతారు. వివిధ ఉపాధ్యాయ శిక్షణలు నిర్వహించడంలో ముందుంటారు. ఈయన 1, 2 తరగతుల విద్యార్థుల బోధనకు రూపొందించిన టీఎల్ఎంలు ఎస్‌సీఈఆర్టీ, ఎస్‌సీఈఆర్టీ అధికారులను ఆకట్టుకున్నాయి. యూట్యూబ్ చానల్ ద్వారా విద్యార్థులకు అవసరమైన పాఠాలను ఈ–కంటెంట్ రూపంలో, నాటికల రూపంలో బోధిస్తున్నారు. ఆయన ఉత్తమ బోధనకు నేడు అవార్డు వరించింది.

ప్రిన్సిపాల్‌ను వరించిన అవార్డు



లక్ష్మణరావు

కొమరాడ: మండలంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల పిన్సిపాల్ డి.లక్ష్మణరావును రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. 1992లో ఒమరవల్లిలో ఉద్యోగ ప్రస్థానం ఆరంభించిన లక్ష్మణరావు 33 ఏళ్లుగా విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం పాటుపడుతున్నారు. వినూత్న బోధన పద్ధతులతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే పలు అవార్డులు అందుకున్న ఆయన రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపిక కావడంపై సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

ఖాకీ.. మా చేతిలో ఉంటేనే!

- పోలీసులపై రాజకీయ ఒత్తిళ్లు
- మాట వినకున్నా.. నిజాయితీగా పనిచేసినా బదిలీ వేటే..
- మన్యం జిల్లా కేంద్రంలో పని చేయడం కొందరికి కష్టం.. ఇంకొందరికి ఇష్టం



సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురం రూరల్:

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో పని చేయాలంటే ఖాకీలు భయపడుతున్నారా? రాజకీయ ఒత్తిళ్లు తీవ్రంగా ఉంటున్నాయా? ముక్కుసూటిగా వ్యవహరించేవారు ఇక్కడ ఎక్కువ కాలం ఉండలేరా? ఆ శాఖలో, ప్రజానీకంలో జోరుగా సాగుతున్న చర్చ ఇదే!. ఇటీవల స్టేషన్లలో జరుగుతున్న బదిలీలు అందుకు ఊతమిస్తున్నాయి. ఇది కాస్త నిక్కచ్చిగా పనిచేసే వారికే వర్తిస్తుంది. అందరికీ కాదండోయ్!. పార్వతీపురం నియోజకవర్గ కేంద్రంలో పోస్టు కోసం రూ.లక్షలు చేతులు మారినట్లు ఇప్పుడు హాట్ టాపిక్. ఇలా ఒకరు రూ.5 లక్షలకు బేరం పెట్టుకున్నట్లు గుప్పుమంటోంది. మరో టీడీపీ నేత బంధువుకు ఇంకో సీటు రిజర్వు చేసేశారు. ఇక్కడికి వచ్చేందుకు కొందరు డబ్బులు ఇచ్చేందుకైనా, పరపతి ఉపయోగించుకునేందుకు అయినా వెనుకాడటం లేదు. అదే సమయంలో మరికొందరు తాము ఇక్కడ చేయలేం బాబోయ్ అంటూ బదిలీ చేయించుకుని మరీ వెళ్లిపోతున్నారు.

వారి బదిలీల వెనుక ఏం జరిగింది?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్వతీపురం పట్టణ సీఐగా నారాయణరావు పనిచేశారు. తీవ్రమైన రాజకీయ, ఇసుకకు సంబంధించిన ఒత్తిళ్ల నడుమ ఇమడలేక, కేవలం 97 రోజులే పనిచేసి బదిలీ చేయించుకుని మరీ వెళ్లిపోయినట్టు సమాచారం. ఆ తరువాత సీఐగా కె.మురళీధర్, ఎస్సైగా గోవింద్ వచ్చారు. ఇద్దరూ రాజకీయాలతో సంబంధం లేకుండా సాధారణ బదిలీల్లో భాగంగా వచ్చిన వారే. విధి నిర్వహణలో ముక్కుసూటిగా ఉంటారన్న పేరు తెచ్చుకున్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను దాదాపు 60 శాతం గాడిలో పెట్టారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై రౌడీ షీట్లు, బైండోవర్లు తెరిచారు. ఈ విషయంలో పార్టీలకు అతీతంగా వ్యవహరించేవారు. ఇటీవల ఎస్సై గోవింద్ ఇదే తరహాలో పలువురు టీడీపీ వారిపైనా చర్యలు తీసుకున్నారు. దీంతో వారంతా స్థానిక ఎమ్మెల్యే వద్ద మొర పెట్టుకున్నట్లు సమాచారం. ఈ పరిణామాల మధ్యనే ఎస్సై గోవింద్‌కు బదిలీ కావడం గమనార్హం. కనీసం రెండేళ్లు కాకముందే స్థాన చలనం కలగడం పోలీస్ ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆయన మార్పు వెనుక ఉన్నతాధికారుల స్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. ఆయన స్థానంలో సురేష్ ఇక్కడికి వచ్చారు. గ్రామీణ పోలీసు స్టేషన్ సీఐగా గోవిందరావు పని చేసేవారు. ఆయన మీద కూడా కూటమి నాయకులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్టు తెలిసింది. దీంతో ఆయన విశాఖ వీఆర్‌కు వెళ్లిపోయారు. ఆ స్థానంలో కొత్తగా రంగనాథం వచ్చారు. ఇప్పుడు గ్రామీణ స్టేషన్ ఎస్సైని కూడా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నట్టు జోరుగా వినిపిస్తోంది. ఆ స్థానంలో ప్రభుత్వ పెద్దలు తమకు అనుకూలమైన వారిని తెచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లా కేంద్రంలో సంఘ విద్రోహ శక్తుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. నేరాలు అధికమవుతున్నాయి. గంజాయి, సారా, దోపిడీ కేసులు ఇటీవల కాలంలో ఎక్కువవుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో తప్పుచేసిన వారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారులను బదిలీ చేస్తుండడం.. మరింత నేరాలకు ఊతమిచ్చినట్లే అవుతుందని ప్రజా సంఘాల ప్రతినిధులు, సీనియర్ సిటిజన్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కూనేటి గెడ్డకు గండి

- ప్రభుత్వం స్పందించి గండిని పూడ్చాలి
- మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

మెంటాడ: మండలంలోని బడేవలస వద్ద కూనేటి గెడ్డకు బుధవారం వేకువజామున గండిపడింది. సుమారు 13 మీటర్ల వెడల్పున గట్టు కోరుకుపోయింది. గెడ్డ నీరు పొలాలపై ప్రవహించడంతో 50 ఎకరాల వరి పంటకు నష్టం వాటిల్లింది. బడేవలసకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మీసాల గురునాయుడు సమాచారంతో మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొర గండిపడిన ప్రాంతాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, కలెక్టర్లు స్పందించి గండిని పూడ్చే పనులు వెంటనే చేపట్టాలని కోరారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

క్లుప్తంగా

మహిళపై మద్యం కేసు నమోదు


మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్న సీఐ రవికుమార్ తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని పసపాం గ్రామంలో అనధికారంగా మద్యం అమ్మకాలు చేస్తున్న మహిళను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు భోగాపురం ఎక్సైజ్ సీఐ రవికుమార్ బుధవారం తెలియజేశారు. అనధికారంగా ఆమె కలిగి ఉన్న 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనధికార మద్యం అమ్మకాలు చేసినట్లయితే సమాచారం ఇవ్వాలని కోరారు. అనధికార మద్యం దుకాణాల వద్ద మద్యం కొనుగోలు చేయవద్దని సూచించారు. దాడుల్లో ఎస్సై చంద్రమోహన్, సిబ్బంది మహేష్, సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

బాలుడికి తప్పిన పెనుప్రమాదం


విద్యుత్ షాక్ తగిలిన బాలుడు రోహిత్

కొమరాడ: మండలంలోని ఆర్తాం గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి డొల్లు రోహిత్‌కి తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల లో 4 వతరగతి చదవుతున్న రోహిత్ రహదారి పక్కనే ఓ భవనం పైకి వెళ్లి ఆడుకుంటుండగా పక్కనే 11 కేవీ వైర్ తగలి కుడి చెయ్యి మొత్తం కాలిపోయింది. అదృష్టవశాత్తు ప్రాణానికి ప్రమాదం జరగలేదు. దీంతో బాలుడి తల్లిదండ్రులు, స్థానికులు హుటాహుటిన జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి పరీక్షల అనంతరం మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. 11 కేవీ వైర్లు ఉన్నప్పటికీ భవనం నిర్మాణం కోసం అధికారులు అనుమతులు ఇవ్వడంతో స్థానికులు మండిపడుతున్నారు.

పశువుల లారీ సీజ్

దత్తిరాజేరు: మండలంలోని ఎస్.బూర్జవలస వద్ద 32 పశువులతో వెళ్తున్న లారీని పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై జి.రాజేష్ బుధవారం తెలిపారు. రామభద్రపురం నుంచి గజపతినగరం వైపు పశువులతో లారీ వస్తోందని కొంత మంది వ్యక్తులు ముందుగా సమాచారం అందించడంతో సిబ్బందితో కలిసి పట్టుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

15న గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమం


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి మన్మథరావు

పార్వతీపురం: గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని ఈనెల 15న నిర్వహించనున్నట్లు జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డా.ఎస్.మన్మథరావు అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పారా వెటర్నరీ సిబ్బంది, గోపాలమిత్రలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం లింగ నిర్ధారిత వీర్యం (ఎస్ఎస్ఎస్) ధరను రూ. 500నుంచి రూ.150కు తగ్గించిందని చెప్పారు. ఈ వీర్యం వల్ల 90శాతంవరకు ఆడదూడలు పుట్టే అవకాశం ఉందన్నారు. దీనిపై పాడి రైతులకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏడీఏ డా.దీనకుమార్, డా.మాణిక్యరావు, డా.శ్రీనివాసరావు, డా.బి.శ్రీనివాస్, డా.శ్రీసంధ్య పాల్గొన్నారు.

మహిళా సంక్షేమంపై మరుపు

- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో క్రమం తప్పకుండా పథకాల అమలు
- ఆసరా, చేయూత, సున్నావడ్డీ పథకాల ద్వారా నిధుల జమ
- జగనన్న తోడు పథకం ద్వారా రూ.49.99కోట్లు
- బ్యాంకు లింకేజీ ద్వారా రూ.947.94కోట్లు
- వైఎస్సార్ చేయూత పథకం ద్వారా నాలుగు విడతల్లో రూ.554.5కోట్లు
- వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా రూ.30.5కోట్లు



వెఎస్సార్ ఆసరా చెక్కువిడుదల చేస్తున్న మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

పొదుపు మహిళల రుణ మాఫీ ఇలా..

విడతలు	సంఘాలు	సభ్యులు	చేకూరిన లబ్ధి(రూ.కోట్లలో)
మొదటి విడత	16,695	1,92,694	11.05
రెండవ విడత	18,868	2,15,165	10.66
మూడవ విడత	20,223	2,30,676	13.68
నాల్గవ విడత	20,223	2,34,256	23.18

వైఎస్సార్ ఆసరా లబ్ధి

విడత	సంఘాల సంఖ్య	సభ్యుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
మొదటి	16,534	1,86,192	93.52
రెండవ	16,646	1,88,069	94.32
మూడవ	16,646	1,83,077	94.32
నాల్గవ	16,652	1,83,081	94.33

వైఎస్సార్ చేయూత సాయం

విడత	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి (రూ.కోట్లలో)
మొదటి విడత 2020	61,498	120.80
రెండవ విడత 2021	75,290	115.29
మూడవ విడత 2022	64,433	177.25
నాల్గవ విడత 2023	75,290	141.16

పార్వతీపురంటౌన్: మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి తీరా అధికారం చేపట్టిన తరువాత కూటమి ప్రభుత్వం మహిళా సంక్షేమాన్ని పక్కన పెట్టి రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోంది. గత జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నవరత్నాల పథకాల అమలులో భాగంగా మహిళలకు పెద్దపీట వేసింది. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా తదితర పథకాలతో పాటు పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, రాయితీలు అందించింది. రుణాలను బ్యాంకుల నుంచి విరివిగా మంజూరు చేయించింది. గత ఐదేళ్ల వివిధ పథకాల కింద ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకున్నారు. కుటీర పరిశ్రమలు, కిరాణా దుకాణాలు, డెయిరీ ఫాంలు నిర్వహిస్తూ మహిళలు ఆర్థికోన్నతి చెందారు. పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో మొత్తం 19,528 స్వయం సహాయక సంఘాల్లోని 2,25,667 మంది మహిళలకు బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు.

సున్నా వడ్డీ భరోసా..

మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి ఆర్థిక భరోసా కల్పించేందుకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని గత ప్రభుత్వం అమలు చేసింది. జిల్లాలోని 2,24,589 మంది మహిళల ఖాతాల్లో రూ.30.50 కోట్ల మేర వడ్డీరాయితీని జమ చేసింది. దిగువ, మధ్యతరగతి మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా బ్యాంకులతో పాటు మల్టీ నేషనల్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుని వ్యాపారం, స్వయం ఉపాధి రంగాల్లో ప్రోత్సహించింది. క్రమం తప్పకుండా బ్యాంకు రుణాలు తీసుకున్నవారి వడ్డీ రాయితీని ప్రభుత్వమే భరించింది. వైఎస్సార్ ఆసరా పథకం కింద ఆర్థిక సహకారం అందించడంతో పాటు వ్యాపార రంగంలో రాణించేలా మెలకువలు నేర్పింది. 45-60 ఏళ్ల మధ్య వయస్సు గల ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల మహిళలకు ఏటా రూ.18,750 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమచేసి గత ఐదేళ్లలో రూ.75 వేలను మహిళలకు అందించింది.

గత ఐదేళ్లలో రూ.947.94 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు

గత ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేయగా బ్యాంకులు కూడా తోడ్పాటునందించాయి. బ్యాంకు లింకేజీ ద్వారా స్వయం సహాయక సంఘాల పరిధిలో ఉన్న 2,60,500 మంది లబ్ధిదారులకు రుణ పంపిణీ లక్ష్యం కాగా, 2,48,419 మంది మహిళలకు రూ.947.94 కోట్లమేర రుణాలను నేరుగా వారి గ్రూపు ఖాతాల్లో జమచేశారు. స్త్రీనిధి పథకం కింద 16,496 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణ పంపిణీ లక్ష్యం కాగా 15,200 మందికి రూ.2.20 కోట్లు అందించారు.

గతంలో మహిళలకు పథకాలు అందేవి

గత ప్రభుత్వంలో మహిళలందరికీ క్రమం తప్పకుండా సంక్షేమ పథకాలు అందేవి. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో నగదు జమ చేశారు. సకాలంలో రుణం చెల్లించాను. ప్రస్తుతం మహిళలకు సంక్షేమ పథకాలు అందడం లేదు. కూటమి ప్రభుత్వం మహిళలకు గతంలో మాదిరిగా పథకాలు అమలు చేసి అండగా నిలవాలి.

–గంగాద వాసవి, 26వ వార్డు, పార్వతీపురం పట్టణం

గతంలో మహిళలకు కొండంత అండ

మహిళలకు బ్యాంకు లింకేజీతో పాటు సున్నా వడ్డీ పథకం రాయితీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి పథకాల ద్వారా గత ప్రభుత్వం ఆర్థికంగా కొండంత అండ నిచ్చింది. పొదుపు మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నింటిలోనూ మహిళలను ప్రధాన లబ్ధిదారులుగా ఎంపిక చేసింది. ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకుని మహిళాసాధికారత దిశగా అడుగులు వేశాం.

–పాలకొల్లు పార్వతి, 15వ వార్డు పార్వతీపురం

మహిళా సంక్షేమాన్ని పక్కన పెట్టారు



మహిళలకు పెద్దపీట వేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారం చేపట్టిన తరువాత మహిళలను మోసం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని వర్గాల మహిళలను మోసం చేయడంలో దిట్ట. ఎన్నికల ముందు మహిళలకు అందజేస్తామన్న సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలి. లేనట్లయితే మహిళా వ్యతిరేకత తప్పదు.

– రెడ్డి పద్మావతి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు

రైలులో ముమ్మర తనిఖీలు


రాయిపూర్ పాసింజర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్‌పీఎఫ్,ఈగల్, డాగ్‌స్క్వాడ్

కొమరాడ: రాయిపూర్ నుంచి విశాఖ వెళ్లే పాసింజర్ ట్రైన్‌లో అక్రమంగా గంజాయి, నిషేధిత వస్తువులు తరలి వెళ్తతున్నాయన్న సమాచారం మేరకు ఎస్సై కె.నీలకంఠం ఆధ్వర్యంలో ఆర్‌పీఎఫ్ సిబ్బంది, డాగ్‌స్క్వాడ్, ఈగల్ టీం తో పార్వతీపురం టౌన్ రైల్వే స్టేషన్‌లో రైలులో బుధవారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఒడిశా, రాయిపూర్ లాంటి ప్రాంతాల నుంచి గంజాయితో పాటు పలు నిషేధిత పదార్థాలతో అక్రమ వ్యాపారులు ప్రయాణం చేస్తున్నారని వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పైడితల్లి జాతర మహోత్సవాల ప్రచార రథం ప్రారంభం


ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతి

విజయనగరం టౌన్:

సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్నాయి. నెలరోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా ఉత్తరాంధ్ర అంతటా అమ్మవారి పండగను ప్రచారం చేసేందుకు గాను ఏర్పాటుచేసిన ప్రచార రథాన్ని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అక్టోబరు 6 సోమవారం తొలేళ్ల ఉత్సవం, 7న మంగళవారం సిరిమాను ఉత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు శరవేగంగా చేస్తున్నామన్నారు. ఆలయ ఈఓ కె.శిరీష మాట్లాడుతూ అమ్మవారికి నెలరోజుల పాటు నిర్వహించే పండగ కార్యక్రమాల్లో భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకోవచ్చన్నారు. అందుకు తగ్గట్టు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అనంతరం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ వైవి.రమణి, తదితరులు పాల్గొన్నారు.

20 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

కురుపాం: కురుపాం సర్కిల్ పరిధిలో ఉన్న జియ్యమ్మవలస మండలం కన్నపుదొరవలస గ్రామంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం దాడులు నిర్వహించగా 20 లీటర్ల సారా కలిగి ఉన్న చినమేరంగి గ్రామానికి చెందిన వెలగాడ మురళి పట్టుబడ్డాడు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సారాను సప్‌లై చేసిన వారి వివరాలు సేకరించి వారిపై కూడా కేసు నమోదు చేస్తామన్నారు. అలాగే పాత కేసులో ముద్దాయి అయిన గుమ్మలక్ష్మీపురం మండలం సవర కోటపాడు చెందిన బిడ్డిక కృష్ణను అరెస్టు చేసి వారిద్దరినీ జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సిరివరలో వైద్యసేవలు


సిరివరలో రక్తపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

సాలూరు రూరల్: మండలంలోని కొదమ పంచాయతీ సిరివర గ్రామానికి వైద్యసేవలు అందించేందుకు వైద్య సిబ్బంది అతి కష్టం మీద చేరుకుని అక్కడ వారందరికీ బుధవారం రక్తపరీక్షలు నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో బాగుజోల నుంచి సిరివర గ్రామానికి రోడ్డు పనులకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేశారు. అయితే రోడ్డు పనులు పూర్తికాక పోవడంతో సిరివర గ్రామానికి రక్తపరీక్షలు నిర్వహించేందుకు వైద్య సిబ్బంది చలకమెండంగి నుంచి 6 కిలోమీటర్ల దూరం కాలినడకన చేరుకున్నారు. ఎంఎల్‌హెచ్‌పీ అశోక్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది అక్కడ 128 మందికి రక్తపరీక్షలు నిర్వహించారు. వారికి ఏడుగురికి సాధారణ జ్వరాలు ఉన్నట్లు తేలిందని ఎంఎల్‌హెచ్‌పీ అశోక్ తెలిపారు.

6న చలో విజయవాడ

- పోస్టర్స్ ఆవిష్కరణ


చలో విజయవాడ పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విజయనగరం గంటస్తంభం: జిల్లాలో ఉన్న విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 6తేదీన ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి డి.రాము, సీహెచ్. వెంకటేష్‌లు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎల్బీజీ భవన్‌లో ప్రచార పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15నెలలు గడిచింది. కానీ విద్యారంగ సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని విమర్శించారు. ప్రధానంగా జిల్లాలో ఐదేళ్ల క్రితం ఏర్పడిన విజయనగరం, రాజాం, గజపతినగరం డిగ్రీ కళాశాలలకు దిక్కుమొక్కు లేకుండా పోయిందని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.6,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసి డిగ్రీ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. పలు డిమాండ్స్ సాధన కోసం జరుగుతున్న చలో విజయవాడ కార్యక్రమంలో జిల్లా విద్యార్థులంతా వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి విద్యాశాఖ కృషి చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను ఏకం చేసి పోరాటం నిర్వహిస్తామని, దీనికి విద్యాశాఖ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్, వి.చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడి జీవితం నాశనం చేసుకోవద్దు

- ఎస్పీ వకుల్ జిందల్ హితవు


ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లాలో వివిధ ఇంజినీరింగ్, మెడికల్, పాలిటెక్నిక్, ఇతర కళాశాలలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో కళాశాలల్లో ర్యాగింగ్ జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందల్ పోలీసు సిబ్బందిని బుధవారం ఆదేశించారు.ఈ మేరకు ఎస్పీ వకుల్ జిందల్ కొన్ని సూచనలు, ఆపై జాగ్రత్తలను సిబ్బందికి, స్టూడెంట్స్‌కు జారీ చేశారు. ర్యాగింగ్ వల్ల కలిగే దుష్ప్రభావాలను విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. తమ పరిధిలోగల ఇంజనీరింగ్, మెడికల్, పాలిటెక్నిక్ కళాశాలలు, ఇతర విద్యాలయాలను సందర్శించి, విద్యార్థులకు ర్యాగింగ్ వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించాలని చెప్పారు. సీనియర్ విద్యార్థులు తోటి విద్యార్థుల పట్ల శృతిమించి ప్రవర్తిస్తే, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించాలని సూచించారు. ర్యాగింగుకు పాల్పడిన విద్యార్థులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫలితంగా అర్ధాంతరంగా చదువు, కెరీర్ నాశనం అవుతాయన్న విషయాన్ని ప్రతి విద్యార్థి గమనించాలని హితవు పలికారు.

స్కూల్ గేమ్స్ కార్యదర్శులుగా గోపాల్, విజయలక్ష్మి



స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులుగా నియామకమైన గోపాల్, విజయలక్ష్మి

విజయనగరం: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులుగా జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు కె.గోపాల్, ఎస్.విజయలక్ష్మిలు ఎంపికయ్యారు. రెండు రోజుల క్రితం విజయవాడలో నిర్వహించిన ఇంటర్వ్యూకు ఐదుగురు వ్యాయామ ఉపాధ్యాయులు హాజరుకాగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని కంటోన్మెంట్ హై స్కూల్ లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కె.గోపాల్, విజయనగరం మండలం జొన్నవలస హై స్కూల్లో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయిని ఎస్.విజయలక్ష్మి లను ఎంపిక చేశారు. గతంలో ఒకే స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఉండగా ఈ ఏడాది నుంచి ప్రతి జిల్లాకు ఇద్దరు చొప్పున పురుషుల నుంచి ఒకరు, మహిళా విభాగం నుంచి ఒకరిని ఎంపిక చేశారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శులుగా ఎంపికైన కె.గోపాల్, ఎస్ విజయలక్ష్మిలను జిల్లా విద్యా శాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వెంకటనాయుడు, జి.లక్ష్మణరావులు అభినందించారు.

జిల్లా ఆస్పత్రిలో బ్రెయిన్ హెల్త్ క్లినిక్ ప్రారంభం



బ్రెయిన్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురంటౌన్: పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో బ్రెయిన్ హెల్త్ క్లినిక్‌ను కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర బుధవారం ప్రారంభించారు. నీతి ఆయోగ్ ప్రాజెక్ట్ బృందం డిల్లీ నుంచి వర్చువల్‌గా బ్రెయిన్ హెల్త్ క్లినిక్ కార్యక్రమాన్ని ప్రసారం చేసి కార్యాచరణ అంశాలపై వివరించింది. జిల్లా ఆస్పత్రి నుంచి కలెక్టర్, ఎమ్మెల్యే, ఆరోగ్య శాఖ అధికారులు ఆన్‌లైన్ ప్రెజెంటేషన్‌ను వీక్షించారు. బ్రెయిన్ హెల్త్ క్లినిక్‌లో అందుబాటులోకి రానున్న సేవలపై జిల్లా ఆస్పత్రి వైద్యబృందంతో వారు చర్చించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక జీవన ప్రపంచంలో మానవుని జీవనశైలి విధానాలు క్రమేణా పలు మానసిక రుగ్మతలు, ఒత్తిడులకు దారి తీస్తున్న నేపథ్యంలో బ్రెయిన్ హెల్త్ పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాల్సిన ఆవశ్యకత ఉందని, నాడీ వ్యవస్థకు సంబంధించిన సమస్యల్లో మైగ్రేన్(పార్శ్వ బాధ) కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయని, అలాగే ఎపిలిప్సీ (ఫిట్స్), ఆటిజం, డిప్రెషన్ కు లోనవ్వడం మొదలగు మానసిక సమస్యలు రోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో బ్రెయిన్ హెల్త్ క్లినిక్ సేవలు అందుబాటులోకి రావడం శుభ పరిణామమన్నారు. మన జిల్లాకు బ్రెయిన్ హెల్త్ క్లినిక్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నందున జిల్లా ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎస్.భాస్కరరావు, డీసీహెచ్ఎస్ డా.నాగభూషణరావు, ఎన్సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డా. జగన్మోహనరావు, సూపరింటెండెంట్ డా.నాగశివజ్యోతి, సైకియాట్రిస్ట్ డా.రష్మిత, వైద్యాధికారులు డా శ్యామల, డా.కౌశిక్, ప్రజాప్రతినిధులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹141	₹252	₹262

నమస్తే కార్యక్రమంపై అవగాహన పెంపొందించుకోవాలి


మున్సిపల్ కమిషనర్ నిర్వహిస్తున్న సమావేశం

సాలూరు: చెత్త, ఇతర కుప్పల్లో దొరికే ప్లాస్టిక్, ఐరన్ వంటి వాటిని ఏరుకునే కార్మికులకు లబ్ధిచేకూర్చేందుకు ప్రవేశపెట్టిన నమస్తే (నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్) కార్యక్రమంపై అవగాహన పెంపొందించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రత్నకుమార్ తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని స్క్రాప్ షాపుల యజమానులతో బుధవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొందరు కార్మికులు చెత్త, ఇతర కుప్పల్లో దొరికే ప్లాస్టిక్,ఐరన్ వంటి వాటిని ఏరుకుని స్క్రాప్ షాపులకు వచ్చి విక్రయించి జీవనం సాగిస్తుంటారని, అటువంటి వారికి యాంత్రిక పద్ధతులపై శిక్షణ ఇచ్చి వారికి మెరుగైన జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపొందించిందని వివరించారు. షాపులకు వచ్చి వాటిని అమ్మే కార్మికుల వివరాలను మున్సిపల్ కార్యాలయానికి అందించాలని సూచించారు. తద్వారా వారికి ఎంతో సాయం చేసిన వారవుతారని అన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో, మ్యాక్సీ క్యాబ్ కార్మికులను ఆదుకోవాలి

విజయనగరం గంటస్తంభం: ఆటో మ్యాక్సీ క్యాబ్ రంగ కార్మికులను ఆదుకోవాలని, ఈనెల17న జరిగే బంద్ కార్యక్రమంలో కార్మికులంతా పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ మోటార్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రమణమూర్తి ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పాండా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.సురేష్ కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక అమర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రీ బస్సు కారణంగా రోడ్డున పడ్డ ఆటో, క్యాబ్ డ్రైవర్లకు వెంటనే ప్రత్యామ్నాయంగా రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అనేక పరిశ్రమలు మూతపడ్డాయని. అందులో ఆటో మ్యాక్సీ క్యాబ్‌లపై జీవనం సాగించే కార్మికులు ఉన్నారన్నారు. తమకు ఓటు వేస్తే వాహనం మిత్రుల కింద పదిహేను వేల రూపాయలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఇప్పటికీ ఆ దిశగా ప్రయత్నం చేయలేదు సరిగదా. ఫ్రీ బస్సు పథకాన్ని తీసుకువచ్చి వారందరినీ రోడ్డున పడేసిన పరిస్థితికి తీసుకు వచ్చిందని ఆందోళన వెలిబుచ్చారు.

• పచ్చనిసోయగం


చిలకమెండంగి గిరిశిఖర గ్రామం సమీపంలో ప్రకృతి అందాలు


శంబర సమీపంలో కొండపై నుంచి జాలువారుతున్న జలపాతం

మక్కువ మండలంలోని గిరిశిఖర గ్రామాల సమీపంలో ఎత్తైన కొండలు పచ్చనిసోయగాలతో, వెండి మబ్బులతో కనువిందు చేస్తున్నాయి. మూడురోజులుగా వర్షాలు కురుస్తుండడంతో అడవితల్లి పచ్చని పైరు పేసుకున్నట్లు చూపరులను ఆహ్లాదపరుస్తోంది. చిలకమెండంగి, బాగుజోల, మెండంగి గిరిశిఖర గ్రామాల సమీపంలో కొండలపై మబ్బులు హోయిలొలుకుతున్నాయి. అలాగే శంబర గ్రామం సమీపంలోని కొండలపై నుంచి జలపాతాలు జాలువారుతుండటంతో ప్రకృతి ప్రేమికులు చూసి పులకిస్తున్నారు.

– మక్కువ